

నేడు గ్రూప్ 2 పరీక్ష

హెల్ప్ డెస్క్ నెంబర్లు 9000665565, 9676928804

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో ఈనెల 25వ తేదీన ఆదివారం నిర్వహించనున్న ఏపీపీఎస్సీ గ్రూప్- 2 పరీక్ష కోసం జిల్లాలో కట్టు దిట్టమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ డా. జి లక్ష్మీ శ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 01:00 గంట వరకు పరీక్షలు జరుగుతాయని, అభ్యర్థులు ఉదయం 09:30 గంటల నుంచి 10 గంటలలోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, పరీక్షా కేంద్రానికి ఉ.10.15 గం.ల తరువాత వచ్చిన అభ్యర్థులు అనుమతించబడరని తెలిపారు. గ్రూప్- 2 పరీక్షల నిర్వహణ కు జిల్లా లో 61 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, 27,894 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వాచ్‌లకు అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అభ్యర్థుల సందేహాల నివత్తి కొరకు హెల్ప్ డెస్క్ నెంబర్ 9000665565, 9676928804 ను ఫోన్ ద్వారా సంప్రదించవచ్చునని, పరీక్ష మొదలైన దగ్గర్నుంచి పూర్తయ్యే వరకు పరీక్ష కేంద్రాల నుంచి అభ్యర్థులు బయటకు వెళ్లేందుకు అనుమతి లేదని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీరు, మెడికల్ కిట్ తో పాటు ఒక ఏఎన్ఎం ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపారు.

'ఊ' నా... 'ఊహూ' నా..!

ఎర్రచందనం 'పుష్ప'లదే పైచేయి
టాస్క్‌ఫోర్స్ సిబ్బందికి రక్షణ కరువు
స్మగ్లర్ల ఘాతుకాలతో అంతర్మధనం
దాడులు చేస్తున్నా పట్టని ప్రభుత్వం
మభ్యపెడుతున్న అధికార గణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అటవీ ప్రాంతానికే పరిమితమైన ఎర్రచందనంను రక్షించడానికి ప్రభుత్వాలు ఏళ్ళ తరబడి ప్రయత్నాలు చేస్తున్నాయి. అయినా స్మగ్లర్లు అధికారుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ తమ టార్గెట్ అయిన ఎర్రచందనంను ఎదోఒకదారిలో దోచుకెళ్లానే ఉన్నారు. ఇప్పటికే లక్షల హెక్టార్ల ఎర్రచందనం ఎల్లలు దాటెల్లింది. దీని వెనుక వైట్ కాలర్ నేరగాళ్లు, ఇంటి దొంగలున్నారన్న విమర్శలు దశాబ్దాలుగా వినిపిస్తున్నా ఆ దిశగా విచారణలు సాగలేదనే చెప్పాలి. ఎర్రచందనం పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన రెడ్ శాండర్స్ యాంటి స్మగ్లింగ్ టాస్క్‌ఫోర్స్ మొదట్లో వాయు వేగంతో పనిచేస్తూ ఎక్కడికక్కడ స్మగ్లర్ల ఆటలు కట్టిస్తూ ఎర్రచందనం ఎల్లలు దాటకుండా పనిచేస్తూవచ్చింది. అయితే ఇటీవలి కాలంలో స్మగ్లర్లు తామనుకున్న పనిని ఎలాగైనా సాధించుకోవాలని అడ్డొచ్చిన వారిపై రాళ్లు, కర్రలతో దాడులు మొదలు పెట్టి నేడు కార్లతో ఢీకోట్టే వరకు వచ్చారంటే స్మగ్లర్లు బరితెగించారని తెలుస్తోంది. ఈ నెల ఫిబ్రవరి 6వ తేదీన టాస్క్‌ఫోర్స్‌కు చెందిన కానిస్టేబుల్ గణేష్‌ను అన్నమయ్య జిల్లా కెవిపురం, సుండుపల్లి మార్గంలో వాహనాల తనిఖీ చేస్తుండగా ఎర్రచందనం స్మగ్లర్లు అతి వేగంగా కారులో వచ్చి ఢీకొట్టి చంపేశారు. ఈ ఘటనలో ఇద్దరు స్మగ్లర్లను అధికారులు అదుపులోకి తీసుకోగా కారు నడిపిన వ్యక్తి తమిళనాడులో పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం. ఈ నెల ఎర్రచందనం పరిరక్షణ విధుల్లో భాగంగా టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందంలోని టాస్క్‌ఫోర్స్ ఏఆర్ కానిస్టేబుల్ ప్రభాకర్‌రావును, అటవీ వాచ్‌గార్డ్‌ను వెంకటగిరి-ఏర్పేడు మార్గంలోని చింతలపాలెం అటవీ తనిఖీ కేంద్రం వద్ద స్మగ్లర్ల వాహనం బ్యారికెడ్లు అడ్డుపెట్టినా వేగంగా వచ్చి బ్యారికెడ్లను ఢీకొట్టి వెళ్ళిపోయారు. ఈ సంఘటన శుక్రవారం తెల్లవారు జామున జరిగినా టాస్క్‌ఫోర్స్ అధికారులు ఎక్కడా బయటికి పొక్కనివ్వకుండా రేణిగుంట సమీపంలోని అమరా హాస్పిటల్‌లో చికిత్స చేయిస్తున్నారు. ఈ సంఘటనపై మీడియాకు వచ్చిన సమాచారంతో పోలీసులను వివరణ కోరగా వారు డివైడర్‌ను ఢీకొని జరిగినట్టుగా చెప్పుకొచ్చారు. స్మగ్లర్ల వాహనం కాదు...గుర్తు తెలియని వాహనమని వివరణ ఇచ్చారు. ఏదిఏమైనా టాస్క్‌ఫోర్స్‌పై ఎర్రచందనం 'పుష్ప'లదే పైచేయిగా ఉంది. మరి ఉన్నతాధికారులు ఊ అంటారో, ఊహూ అంటారో మరి.

టాస్క్‌ఫోర్స్ ఎస్పి ఇలా....

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్‌పై ఎర్రచందనం స్మగ్లర్ల కారు వెళ్లడం నిజమే. కారు ఆచూకి దొరకలేదు. ఏర్పేడు పోలీసులు గాలిస్తున్నారు. ఈ ఘటనపై హత్యాయత్నం సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు ఏర్పేడు పోలీసులు. శనివారం ఎస్పిని కలిసిన విలేకరులతో టాస్క్‌ఫోర్స్ కె.శ్రీనివాస్ స్పందించిన మాటలివి. అసలు ఎర్రచందనం పరిరక్షణ కోసం విధులు నిర్వర్తించే సిబ్బందికి రక్షణ కల్పించలేని పరిస్థితికి టాస్క్‌ఫోర్స్ ఎందుకు చేరుకుంది. సాధారణంగా తనిఖీ కేంద్రాల వద్ద సిసి కెమరాలు ఉంటాయి. చింతల పాలెం ఘటనలో కారు ఎటువైపు వెళ్లిందో కూడా ఎందుకు నిర్ధారించలేకపోతున్నారు. అధికారుల వెనకడుగుల వెనుక రాజకీయ ఒత్తిళ్లున్నాయా?. లేక మరే కారణాలు దాగి వున్నాయో తెలీయడం లేదు. అధికారుల వెనకడుగుతో టాస్క్‌ఫోర్స్‌లో ఉన్న సిబ్బంది అంతర్మధనంలో ఉన్నట్టుగా తెలుస్తోంది. అసలు టాస్క్‌ఫోర్స్‌లో ఏమి జరుగుతోందో ఎవరికి అంతుపట్టడం లేదు.

మెజార్టీ ఊహించినవే..!

వివాదాస్పద స్థానాలకు బ్రేక్
చిత్తూరులో 5, తిరుపతిలో 2
టిడిపి తొలిజాబితా ప్రకటన



నారా చంద్రబాబు, కుప్పం | అమరనాథరెడ్డి, పలమనేరు | డాక్టర్ థామస్, జీడీనెల్లూరు | గాలి భానుప్రకాష్, నగరి | గురజాల జగన్మోహన్, చిత్తూరు | పాశం సునీల్, గూడూరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

టిడిపిలో ఆశావాహులకు చోటు దక్కింది.. వివాదాస్పద స్థానాలకు బ్రేక్ పడింది. జనసేన, టిడిపి ఉమ్మడి పొత్తుతో సార్వత్రిక ఎన్నికల్లో ముందుకెళుతోంది. విజయవాడలో చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్ ప్రకటించిన తొలి జాబితాలో చిత్తూరు జిల్లాలో ఐదుగురిని, తిరుపతిలో ఇద్దరిని ఖరారు చేశారు. చిత్తూరులో గురజాల జగన్మోహన్, నగిరి గాలి భానుప్రకాష్, జీడీనెల్లూరు డాక్టర్ థామస్, పలమనేరు అమరనాథరెడ్డి, కుప్పం నారా చంద్రబాబునాయుడు బరిలో ఉండనున్నారు. చిత్తూరులో పూతలపట్టు, పుంగనూరు అభ్యర్థులను ప్రకటించాల్సి ఉంది. పుంగనూరులో టిడిపి తరఫున చల్లా రామచంద్రారెడ్డి పోటీలోఉన్నప్పటికీ కొత్తగా పార్టీ పెట్టిన రామచంద్రయాదవ్ పొత్తులో భాగంగా పుంగనూరు అడుగుతున్నట్లు సమాచారం. పూతలపట్టులో జరిగిన బహిరంగసభలో కలికిరి మురళీమోహన్‌ను ఆదరించాలని పిలుపున్చినా తొలి జాబితాలో పేరు లేకపోవడం గమనార్హం.

తిరుపతి జిల్లాలో గూడూరు పాశం సునీల్‌కుమార్, సూళ్లూరుపేట నెలవల విజయశ్రీలను ప్రకటించారు. సత్యవేడు, వెంకటగిరి, శ్రీకాళహస్తి, తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో అభ్యర్థులకు ఇంకా ప్రకటించలేదు. తిరుపతి జనసేనతో పొత్తులో భాగంగానే పెండింగ్‌లో పెట్టినట్లు తెలుస్తోంది. చంద్రగిరి, సత్యవేడులో అనిశ్చిత పరిస్థితి ఉంది. శ్రీకాళహస్తిలోనూ జనసేన అభ్యర్థి పట్టుబడుతున్నట్లు సమాచారం. వెంకటగిరిలో ఎస్సీవీ నాయుడు పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది.

సత్యవేడులో రాజకీయ అనిశ్చితి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సత్యవేడు నియోజకవర్గంలో రాజకీయ అనిశ్చితి నెలకొంది. వైసిపిలోనూ, టిడిపిలోనూ గందరగోళ పరిస్థితి. వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ కోనేటి ఆదిమూలంను పక్కన పెట్టి స్థానికేతరుడైన ఎన్.రాజేష్‌కు టిక్కెట్‌ను ఖరారు చేసింది. రాజకీయాలకు కొత్త, ఆ నియోజకవర్గానికి నాన్ లోకల్ కావడంతో వైసిపిలోనే కార్యకర్తలు, నాయకులు పెదవి విరుస్తున్నారు. మళ్లీ ఇక్కడ అభ్యర్థిని మార్చే యోచనలో అధిష్టానం ఉన్నట్లు సమాచారం. స్థానికంగా ఎంపిపిగా ఉన్న విజయ్‌కు ఇవ్వాలని ఆదిమూలం వ్యతిరేకవర్గం బలపరుస్తోంది. టిడిపి పరిస్థితికి వస్తే ఇంతవరకూ అభ్యర్థిని ప్రకటించలేదు. ఆదిమూలం తిరుగుబావుటా ఎగురవేసి వెనువెంటనే నారా లోకేష్ ద్వారా చంద్రబాబును కలిసారు. తాజాగా నిన్న శుక్రవారం నారా భువనేశ్వరి పర్యటన సందర్భంగా ఆమెకు నారాయణవనంలో ఘన స్వాగతం పలికారు. ఈనెల 26న పసుపు కండువా కప్పుకుంటారని చర్చ నడుస్తోంది. టిడిపి నుంచి సత్యవేడుకు ముగ్గురు ఆశావాహులు ఉన్నారు. మాజీ ఎంఎల్ఎ హేమలత కుమార్తె డాక్టర్ హెలెన్ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఆమెకే టిక్కెట్ ఖరారు చేయాలని కొంతమంది పట్టుబడుతున్నారు. 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన

ఇరు పార్టీల్లోనూ గందరగోళం



ఆదిమూలం | డాక్టర్ హెలెన్ | జడ్డా రాజశేఖర్

జడ్డా రాజశేఖర్ మద్దతుదారులతో ఒత్తిడి తెప్పిస్తున్నారు. తనకు టిక్కెట్ ఇవ్వకపోయినా ఆదిమూలంకు ఇవ్వరాదని, హెలెన్‌కు ఇస్తే సహకరిస్తానని బాహాటంగానే చెబుతున్నారు. ఈ నేపథ్యంలో టిడిపి నుంచి ముగ్గురు టిక్కెట్ ఆశిస్తుండడంతో ఎవరికి ఇస్తారనే విషయమై అనిశ్చితి నెలకొంది. జిల్లాలో రాజకీయంగా చక్రం తిప్పుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఎదిరించే వ్యక్తి ప్రస్తుతం ఆదిమూలం. కాబట్టి ఆయనకే ఇచ్చే అవకాశం ఉందన్న చర్చ నడుస్తోంది. కాంగ్రెస్, కమ్యూనిస్టులు సైతం పొత్తు ఖరారైన నేపథ్యంలో కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ కుమార్తె చింతా నేహ బరిలో ఉంటారని సమాచారం. అలాగే ఎంటెక్ రవి కూడా కాంగ్రెస్ నుంచి టిక్కెట్ ఆశిస్తున్నారు.

నెలవలా...మజాకా..!

అనూహ్యంగా తొలిజాబితాలోనే చోటు

ప్రజాశక్తి - సూళ్లూరుపేట






నెలవల కుమార్తె విజయశ్రీ

నాళ్లూరుపేట టిడిపి అభ్యర్థి ఎవరనే విషయమై ఎన్నో ఊహా గానాలకు తెరదించుతూ అనూహ్యంగా ఎవరూ హించని రీతిలో నెలవల విజయశ్రీ పేరును ప్రకటించారు. డాక్టర్ సందీప్, శ్రీపతిబాబు, పనబాక కృష్ణయ్య.. ఇలా ఒకటేంటి.. పదుల సంఖ్యలో పోటీ నెలకొంది. వైసిపిలో గ్రూపు తగాదాలతో తమకు అవకాశం ఉంటుందన్న ఆశతో ఆశావాహూలు పదుల సంఖ్యలో పెరిగారు. అధినేత నారా చంద్రబాబునాయుడును ఎవరు కలిసినా నొప్పించక గోప్యంగానే ఉన్నారు. ఎవరికి సీటు ఇచ్చినా కలిసి ఐక్యంగా పనిచేయాలని చెబుతూ వచ్చారు. పార్టీ కష్ట సమయంలో నాలుగు సంవత్సరాలుగా పార్టీని బలోపేతం చేయడంలో నెలవల సుబ్రమణ్యం మొదటి విజయం సాధించాడు.వయస్సు రీత్యా తన కుమార్తెకు టిక్కెట్ ఇవ్వాలని అధినేతను కోరినట్లు సమాచారం. ఏదిఏమైనా నెలవల మార్క్ రాజకీయంతో కుమార్తెకు టిక్కెట్‌ను తెచ్చుకోగలిగారని చర్చ నడుస్తోంది.

పట్టాలకు స్థానికంగానే స్థలాలివ్వాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



మంగళం పరిధిలోని పేదలకు వైసిపి ప్రభుత్వం జగనన్న ఇంటి పట్టాలను మంజూరు చేసి ఏళ్లు గడిచినా స్థలాలు చూపకపోవడంపై సిపిఎం ఆధ్వర్యంలో శనివారం రణధీరపురం పంచాయతీలోని సచివాలయం వద్ద లబ్ధిదారులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కె.వేణుగోపాల్, ఎం.మాధవ్, నిమ్మనపల్లి మునిరత్నం మాట్లాడుతూ ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీలో 2736 మంది పేదలను ఇళ్ళ పట్టాలకు అర్హులుగా గుర్తించి 2020లో పట్టాలను మంజూరు చేశారన్నారు. అయితే ఇళ్ళపట్టాలను ఇచ్చి స్థలాలను చూపడానికి అధికారులు ముందుకు రావడం లేదన్నారు. మంగళం పరిధిలోని చెన్నాయిగుంట గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబర్ 195/2లో స్థలాలు ఇవ్వడానికి అధికారులు చదును చేసి సర్వే రాళ్ళను నాటారని, ఇంతలో కెబినెట్‌లో సదరు స్థలాన్ని సర్వే ట్రయినింగ్ అకాడమీకి కేటాయిస్తు నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇప్పటి వరకు సదరు స్థలంలో పునాది రాయి కూడా వెయ్యలేదని, అధికారులు వెంటనే మంగళం ప్రాంతంలో ఇళ్ళపట్టాలు పొందిన లబ్ధిదారులకు 195/2లోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇళ్ళ పట్టాలు పొందిన లబ్ధిదారులతో కలిసి సచివాలయ కార్యదర్శికి వినతి ఇచ్చే క్రమంలో వైసిపికి చెందిన నాయకులకు సిపిఎం పార్టీ నాయకులకు వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం సచివాలయ కార్యదర్శి త్రినాధ్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో పులిచెర్ల బుజ్జి, ఎ. రాధాకష్ణ, మోధిన్, బాదుల్లా, హమీద్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎగరని 'కిసాన్' డ్రోన్లు

ప్రకటనలకే పరిమితమైన వ్యవసాయ శాఖ
మింగ మెతుకు లేదు..కిసాన్ డ్రోన్లంట..
'మేకనైజ్డ్' పథకంపై అన్నదాతల పెదవి విరుపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



మింగ మెతుకు లేదు.. అన్నదాతకు కిసాన్ డ్రోన్లంట.. 'పంటల సాగులో విత్తనాలు, ఎరువులు చల్లేందుకు... క్రిమిసంహారక మందులు పిచికారీ చేసేందుకు... రైతులకు డబ్బు, సమయం ఆదా చేసేలా... కూలీల లభ్యత సమస్యకు పరిష్కారం చూపేలా....రాష్ట్రంలో కిసాన్ డ్రోన్లు అందుబాటులోకి తెస్తున్నాం' రైతులనుద్దేశించి సీఎం జగన్ చెప్పిన మాటలివి....పదివేల ఆర్‌బికెల్లో దశలవారీగా రాయితీపై డ్రోన్లు ఇస్తామని, దీనివల్ల 20వేల మందికి ఉపాధి లభిస్తుందని, తొలి దశలో 600 డ్రోన్ సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తామని 2022-23 వ్యవసాయ బడ్జెట్లో ప్రకటించారు. అయితే ఇప్పటికీ ఒక్క కిసాన్ డ్రోన్ కూడా ఎగిరిన దాఖలా లేదు. ఆరుగాలం కష్టపడితే తప్ప అన్నదాతకు నాలుగు వేళ్లు లోపలికి వెళ్లే పరిస్థితి లేదు. అలాంటిది బూర్జువా, ధనిక రైతులకు ఉపయోగపడే డ్రోన్లను సామాన్య, పేద రైతులకు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ప్రకటించడం హాస్యాస్పదమేనని రైతుసంఘాలు విమర్శిస్తున్నాయి.

వ్యవసాయ డ్రోన్లు కొనుగోలుకు తిరుపతి జిల్లాలో రైతులు పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. డ్రోన్లు ధరలు పది లక్షలపైమాటే. అంత పెద్ద మొత్తంలో వెచ్చించి కొనుగోలు చేయడానికి అన్నదాతలు ముందుకొచ్చే పరిస్థితి లేదు. తిరుపతిలో అగ్రికల్చర్ యూనివర్సిటీ ఉన్నప్పటికీ ఇక్కడ శిక్షణ ఇచ్చే సిబ్బంది లేకపోవడం గమనార్హం. ఏదో అడపాదడపా ఏడాదికి రెండుమూడుసార్లు రైతులను పిలిపించి శిక్షణ ఇచ్చి మమా అనిపించుకుంటున్నారన్నది వాస్తవం.

20 మండలాల్లో 25 బృందాలు

మేకనైజ్ అగ్రికల్చర్ పథకం కింద 20 మండలాల్లో 25 మంది సభ్యులు చొప్పున 25 గ్రూపులు ఏర్పాటు చేశారు. ముందుగా మండలానికి మూడు డ్రోన్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ డ్రోన్లు ఆపరేటర్ చేసే దానికి నిపుణులు లేకపోవడంతో నిబంధనలను సడలించారు. మండలానికి ఒకరినైనా అందుబాటులోకి తీసుకోరావాలని అమరావతిలో శిక్షణ ఇచ్చారు. ప్రస్తుతానికి ఈ సీజన్ లో పథకం అమలు అయ్యే విధంగా కనబడడం లేదు. డ్రోన్ పైలెట్‌గా ఎంపికయ్యే అభ్యర్థికి సాగుభూమి తప్పనిసరిగా ఉండి, వ్యవసాయ డిప్లొమా, ఇంజినీరింగ్ చేసిన వారు అర్హులు. 15 రోజుల శిక్షణ అనంతరం మూడేళ్లపాటు సేవలు అందిస్తామనే అంగీకారపత్రం అందజేయాలి.

నాలుగు లక్షలు రాయితీ

అయిదుగురు రైతులను కమ్యూనిటీ హైరింగ్ గ్రూపు (సీహెచ్‌సీ)గా ఏర్పాటు చేసి డ్రోన్ కొను గోలు చేసేందుకు ప్రభుత్వమే రుణం అందిస్తుంది. రాయితీ పోగా మిగిలిన మొత్తాన్ని రైతులు 36 నెలల్లో చెల్లించాలి. వ్యవసాయ అవసరాలకు వినియోగించే డ్రోన్ ఖరీదు రూ. 10లక్ష లు ఉంది. ప్రభుత్వం రూ. నాలుగు లక్షలు రాయితీ ఇస్తుండగా రూ లక్ష రూపాయలు రైతు చెల్లించాలి. మిగిలిన ఐదు లక్షలు బ్యాంకు లోను ఇస్తారు .బందంలో ప్రతి ఒక్కరూ రూ. 20 వేల చొప్పున పెట్టు బడి పెట్టాలి. జిల్లాలో 50 శాతం వరకు చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు. జిల్లాలో 10 ఎకరాలు ఎక్కువ పొలం ఉన్నవారు 20శాతం మాత్రమే. తక్కువ భూమి ఉన్న రైతులు డ్రోన్ వినియో గంపై ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో సాగయ్యే పంట లకు ఏడాదిలో మూడు నెలలైనా డ్రోన్లు వినియోగించే పరిస్థితి లేదు.

అగ్రికల్చర్ కళాశాల వర్కర్స్ సమ్మె విరమణ

ప్రజాశక్తి - క్యాంపస్

అగ్రికల్చర్ కళాశాలలో పనిచేస్తున్న కార్మికులు తన న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ గత ఎనిమిది రోజుల నుంచి చేస్తున్న సమ్మెను శనివారం విరమించారు. తుడా చైర్మన్ మోహిత్ రెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అదేవిధంగా యూనివర్సిటీ యాజమాన్యంతో మాట్లాడి కాంట్రాక్ట్ కింద పని చేస్తున్న వర్కర్స్ అందరికీ ఆప్కాస్ లో చేర్చే ప్రయత్నం చేస్తామని, ఐడెంటిటి కార్డులు మంజూరు చేయిస్తామని, జాతీయ సెలవులు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సమ్మెలో పాల్గొన్న కార్మికులంతా త్వరగా సమస్యలు పరిష్కారం చేయాలని మోహిత్ రెడ్డిని కోరారు. సిఐటియు జిల్లా నాయకులు ఎస్.జయచంద్ర, యూనియన్ నాయకులు వరలక్ష్మి, చంద్రమ్మ, సుబ్బు, ముని, లక్ష్మి, రాధా పాల్గొన్నారు.





తిరుపతి పుట్టినరోజు అందరి వేడుక

ప్రజాశక్తి - తిరుపతి సిటి

'మన తిరుపతికి పుట్టినరోజు వేడుక అందరిదీ' అని టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. తిరుపతి ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గోవిందరాజు స్వామి ఆలయం ఎదుట జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 894 సంవత్సరాల కిందట జగద్గురు శ్రీరామానుజాచార్యుల అమత హస్తాలతో ఈ ప్రాంతానికి శంకుస్థాపన జరిగిందన్నారు. చిదంబరం నుంచి తీసుకొచ్చిన గోవిందరాజస్వామి ప్రతిమను ప్రతిష్టించడంతోపాటు ఈ ప్రాంతానికి గోవిందరాజపురంగా నామకరణ చేశారన్నారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి మాట్లాడుతూ తిరుపతి అభివద్ధికి టీటీడీ సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. తిరుపతి నగరాన్ని కూడా తిరుమల తరహాలో సుందరంగా తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ఆధ్యాత్మిక వాతావరణంఉండాలన్న ఉద్దేశంతోనే తిరుమల తిరుపతి దేవస్థానాల ద్వారా తిరుపతిని అభివద్ధి చేస్తున్నామన్నారు. తిరుపతి అభివద్ధికి అందరూ సహకరించాలని కోరారు. అనంతరం గోవిందరాజు స్వామి మాడవీధుల్లో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, ఎం ఎల్ సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ రెడ్డి, ముద్ర నారాయణ, పెద్ద జీయర్, చిన్న జీయర్ స్వామీజీలు పాల్గొన్నారు.

మామిడి 'పూత'... దిగుబడి 'కోత'

చెట్లల్లో కానరాని పూతలు, పిందెలు
విరివిగా రసాయన మందుల పిచికారీ
ఈ'సారి' కాయలు అంతంతమాత్రమేనా..
ధర రెట్టింపు ఉంటుందంటున్న ఆశ

ప్రజాశక్తి - యర్రావారిపాలెం

జిల్లాలో మామిడి విస్తారంగా సాగు చేసే ప్రాంతాల్లో యర్రావారిపాలెం మండలం ప్రథమస్థానం. సగానికి పైగా రైతులు మామిడిపైనే ఆధారపడి జీవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్యానవన తోటల్లో ఉపాధి హామీ పథకానికి అవకాశం ఇచ్చిన తరువాత మండల వ్యాప్తంగా 9వేల ఎకరాల్లో మామిడి పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఏటా రాజస్థాన్, మహారాష్ట్ర, బెంగుళూరు రాష్ట్రాల నుంచి వ్యాపారులు వచ్చి కోట్లల్లో బిజినెస్ చేస్తున్నప్పటికీ సిండికేట్ వల్ల రైతులకు మాత్రం నష్టాలే మిగులుతున్నాయి. దీనికితోడు ఈసారి మామిడి పూత అంతంతమాత్రంగానే ఉంది. 30 శాతమే పూత కనిపిస్తుంది. మరోవైపు వైరస్ ప్రభావం చెట్లపై ఎక్కువగా ఉన్నప్పటికీ అధికారులు అవగాహన కల్పించడం లేదన్న విమర్శలూ ఉన్నాయి. పూత బాగా రావాలని, వైరస్ పోతుందన్న ఆశతో రైతులు పెట్టుబడులు అధికంగా పెడుతూ విరివిగా మందులను పిచికారీ చేస్తుండటం గమనార్హం. వ్యాపారులు ముందస్తుగా ఎకరా 30వేలకు కొనుగోలు చేస్తున్నారు. తోతాపురి టన్ను 10-20వేలు, బంగినపల్లి, బేనీషా, ఇతర రకాలు 20-30వేలు ధర పలుకుతాయన్న ఆశతో రైతులు, వ్యాపారులు ఉన్నారు.

సకాలంలో రాని మామిడి పూత

ప్రకతి భౌగోళిక పరిస్థితులు అతివష్టి అనావష్టి వల్ల డిసెంబర్ ,జనవరి కి పూర్తిగా రావాల్సిన మామిడి పూత దశలవారిగా రావడంతో ముందుగా వచ్చిన మామిడి పూతకు వైరస్ సోకడం వల్ల పూర్తిగా రాలిపోతోంది. పూతతో పాటు లేత ఇగురులు ఎక్కువగా రావడంతో మామిడి పూత పూర్తిస్థాయిలో తేనె మంచు వైరస్ బారిన పడి మామిడి పిందెలు రాకముందే పూతలు మాడిపోతున్నాయి. పూత దశ నుండి కాయలు కోసే వరకు నాలుగు నుండి ఆరు సార్లు మందులు పిచికారి చేయడం వల్ల రైతులకు



ఎకరాకు 15వేల నుండి 20 వేల వరకు ఖర్చులు పెరిగి నష్టాల్లో కూరుకు పోతున్నారు. అధిక దిగుబడి వచ్చిన మామిడి తోటలను కొనుగోలు చేస్తే తప్ప వ్యాపారస్తులకు లాభాలు రావడం లేదు. దీనికి తోడు దళారులు వ్యాపారస్తులను మరింత దెబ్బతీస్తున్నారు. మామిడి రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసిన వ్యాపారులకు మామిడి ఫ్యాక్టరీ యజమానులు సిండికేట్ కావడంతో ఆశించిన స్థాయిలో ధర పలకడం లేదు. ఈ సంవత్సరం దిగుబడి తక్కువగా ఉంటుంది కాబట్టి ధర బాగుంటుందని రైతులు ఆశతో ఉన్నారు. అధికారులు పంట నష్టంపై అంచనాలు వేసి నష్టపరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

మామిడికి డిమాండ్ పెరగడం లేదు : కాలేషా, మండీ నిర్వాహకుడు, నెరబైలు

మామిడి పంట ఆశించిన స్థాయిలో వచ్చినా రాకపోయినా ధర మాత్రం నామమాత్రంగానే ఉంటుంది. కాయలు కోసిన తరువాత మండీ కమీషన్లు, కూలీలు, బాడుగలు తీసేస్తే లాభాల కంటే నష్టాలే ఎక్కువగా వస్తున్నాయి. పంటను ఇతర రాష్ట్రాలకు, విదేశాలకు రవాణా చేస్తేనే ధరలు పెరిగి మామిడి రైతులు లాభాల్లోకి వచ్చే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆ విధంగా ఎగుమతులపై దృష్టి సారించాలి.

మామిడి రైతులను ఆదుకోవాలి : నాగిశెట్టి కుమార్, రైతు

మామిడి పంటపై ఆధారపడి జీవిస్తున్న రైతులు నష్టాల బారిన పడకుండా ప్రభుత్వం ఆదుకోవాలి. మామిడి పంట దిగుబడి అధికంగా వచ్చేలా అధికారులు తగు సలహాలు, సూచనలు ఇవ్వాలి. మామిడి పంటను నేరుగా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలి.

అవగాహన కల్పిస్తున్నాం : శివకుమారి, హార్టికల్చర్ ఆఫీసర్



మామిడి రైతులకు నిరంతరం అవగాహన కల్పిస్తున్నాం. ఈ ఏడాది 30శాతం మాత్రమే మామిడి పూత వచ్చింది. ధరలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రైతుకు ఎకరాకు 15వేల నుంచి 20వేల వరకు ఖర్చు అవుతుంది. ఈ ఏడాది తోతాపురి, నీలం తప్ప బెనిషా మిగతా రకాలు సరిగ్గా పూతలు రావడం లేదు.

'ఆత్మీయ' హోరు...విమర్శలు 'జోరు'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజాదృష్టి

త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో బూర్జువా రాజకీయ పార్టీలు ప్రచారానికి తెరతీశాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్ఆర్‌సిపి ఆత్మీయ సభలు, సదస్సులతో తమ హోరును కొనసాగిస్తోంది. మరో పక్క ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి, జనసేన, కాంగ్రెస్‌లు ప్రభుత్వ నిరంకుశత్వాన్ని, దోపిడిని, అక్రమాలను, ఎండగడుతూ విమర్శల జోరు పెంచింది. ఈ సారి మమ్మల్ని నమ్మండి అంటే మమ్మల్ని నమ్మండి అంటూ అధికార పార్టీ ఎన్నికలకు సిద్దంఅంటే, ప్రతిపక్షం సంసిద్ధం అంటూ ప్రజల్లోకి వస్తుండడం గమనార్హం.

మరో రెండు నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత 2019 ఎన్నికల్లో అధికార పార్టీ వైఎస్ఆర్‌సిపి 14 అసెంబ్లీ స్థానాలకు గాను 13స్థానాలను (ఒక కుప్పం తప్పా) కైవసం చేసుకుంది. తిరుపతి, చిత్తూరు, రాజంపేట మూడు పార్లమెంట్ స్థానాలను గెలుచుకుంది. ఎన్నికల అనంతరం జిల్లాల విభజన జరగడంతో నెల్లూరు జిల్లాలోని కొన్ని అసెంబ్లీ స్థానాలను తిరుపతి జిల్లాలో కలుపుతూ, చిత్తూరు జిల్లాలోని కొన్ని అన్నమయ్య జిల్లాలో విలీనం చేశారు. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో ఏడు నియోజకవర్గాలు, చిత్తూరు జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. (ఒక సత్యవేడు ఎంఎల్‌ఏ ఆదిమూలం తప్పా). తిరుపతి, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేటలో నియోజకవర్గంలో అధికార పార్టీ ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో అగ్రభాగంగా తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల్లో నిలుస్తున్నాయి. మరో పక్క కులాలు, మతాలు, ప్రాంతాలు, సంఘాల వారీగా ఆత్మీయ సమావేశాలు నిర్వహిస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు.

విమర్శలకు పదును పెట్టిన ప్రతిపక్షం...!

మరో పక్క ప్రధాన ప్రతిపక్షంమైన తెలుగుదేశం పార్టీ, దానికి మిత్రపక్షమైన జనసేనతో కలిసి అధికార పార్టీపై విమర్శలను ఎక్కుపెట్టారు. జనసేన, టిడిపి అలియన్స్ ఉండడంతో ఏ స్థానం ఏ పార్టీకి కేటాయిస్తారో ఇప్పటికి పూర్తిస్థాయిలో స్పష్టత రాలేదు. దీంతో ఆశవాహులందరూ మూక్కుమ్మడిగా అధికార పార్టీపై విమర్శలు ఎక్కుపెట్టారు. చంద్రగరి నియోజకవర్గంలో మినహా మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో టిడిపి ప్రచారం అంతంత మాత్రమే ఉంది. శ్రీకాళహస్తి కొంత పర్వాలేదని పించిన, సత్యవేడు, గూడురు, వెంకటగిరి, సూళ్లూరుపేటలో పెద్దగా ప్రచారానికి ప్రాధాన్యత ఇవ్వలేదు. తిరుపతిలో ప్రచారాన్ని పక్కన పెట్టి ఎక్కువుగా సిట్టింగ్ ఎంఎల్ఏపై, కార్పొరేషన్ డిప్యూటీ మేయరుపై విమర్శలకే ప్రాధాన్యత ఇస్తున్నారు. తిరుపతిలో రోడ్ల విస్తరణ పేరుతో అవినీతి జరిగిందని, టిడిఆర్ బాండ్లలో కుంభకోణం చోటు చేసుకుందని, తిరుపతిలో అన్ని రంగాల్లో అవినీతి హెచ్చుమీరిందని, టిటిడిని సైతం అధికార పార్టీ తమ అవసరాలకు వాడుకుంటోంది అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. తిరుపతి జిల్లాలో అధికార పార్టీ ప్రచారం హోరెత్తిస్తుండడంతో , ప్రతిపక్షం అదే స్థాయిలో విమర్శల జోరును ఎక్కుపెట్టింది.

కళ్యాణ వెంకన్న బ్రహ్మోత్సవ ఏర్పాట్ల పరిశీలన

ప్రజాశక్తి -రామచంద్రాపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం శ్రీనివాస మంగాపురం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవ ఏర్పాట్లను టిటిడి తిరుపతి జేఈవో వీరబ్రహ్మం పరిశీలించారు. శనివారం జేఈవో వీరబ్రహ్మం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన క్యూలైన్లు, చలువ పందిళ్ళు, కోనేరు, ధ్వజస్తంభాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 29 నుండి మార్చి 8వ తేదీ వరకు శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని, సామాన్య భక్తులకు బ్రహ్మోత్సవాలలో దర్శనం కల్పించాలని అధికారులను ఆదేశించారు. బ్రహ్మోత్సవాలకు కట్టుదిట్టమైన గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని చంద్రగిరి పోలీసులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రత్యేకశ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ రెడ్డి, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి -దొరవారిసత్రం: ఏపిశాక్స్ సహకారంతో, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ విభాగం సహకారంతో నవజీవన్ సిసి స్వచ్ఛంద సంస్థ – మన సంస్కృతి కళా సంస్థ బృందం ద్వారా శనివారం మండలం లోని నెలబల్లి ఏరియాలో నాటకాలు, పాటలు, ఆటలు ద్వారా హెచ్.ఐ.వి. ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ సి.సి ప్రాజెక్టు మేనేజర్ కె. బాలాజీ, ఓ.ఆర్.డబ్ల్యు డి. ఐశ్వర్య, పి.ఇ డి. నాగార్జునయ్య, యమ్.ఇ.ఎ సి.హెచ్. కవిత, మన సంస్కృతి కళా సంస్థ బృందం కె రెడ్డయ్య పాల్గొన్నారు.

రాజీకి లోబడే క్రిమినల్ కేసులు పరిష్కరించండి: జడ్జి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 'మీ మీ డివిజన్ పరిధిలో రాజీకి లోబడే క్రిమినల్ కేసుల పరిష్కారానికి కృషి చేయండి' అని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర పోలీసు అధికారులకు సూచించారు. కోర్టు ఆవరణలో పోలీసు శాఖ అధికారులతో జాతీయ లోక్‌అదాలత్ పై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పుత్తూరులో వచ్చే నెల 9న జరిగే జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి రాజీకి లోబడే క్రిమినల్ కేసుల పరిష్కారానికి పోలీసు శాఖ అధికారులు కృషి చేయాలని కోరారు. పెండింగ్ కేసులు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జానకి, డిఎస్పి శ్రీనివాసరావు, పుత్తూరు రూరల్ అర్బన్ సిఐలు భాస్కర్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆశతో కాదు..ఆశయంతో వచ్చా: డాక్టర్ మస్తాన్ యాదవ్

ప్రజాశక్తి -వెంకటగిరి రూరల్ : టిడిపి ఆశయాలు చూసి ఆశయంతో వచ్చానని ఆశతో రాలేదని టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మస్తాన్ యాదవ్ అన్నారు. టిడిపి బీసీల అభివృద్ధికి కృషి చేసే పార్టీ అని శనివారం ప్రకటించిన అభ్యర్థుల మొదటి జాబితా అందరికీ సమన్యాయం చేసేలా వుందన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యావంతులను, అన్ని వర్గాలను దృష్టిలో పెట్టుకుని ప్రకటించడం జరిగిందన్నారు. వెంకటగిరి నియోజకవర్గ జనరల్ సీటు అయినా పార్టీ కోసం గట్టిగా పని చేసి గెలవగలిగే సత్తా తనకు వుందని అధిష్టానం దృష్టికి వెళ్లానని, తన పేరు పరిశీలనలోవుందని రెండవ జాబితాలో పేరు ప్రకటిస్తారని ఆశిస్తున్నానని తెలిపారు. అధిష్టానం ఏ నిర్ణయం తీసుకున్నా అభ్యర్థి ఎవరైనా వారి గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రామచంద్రయ్య, మురళి, శ్రీనివాస్ యాదవ్, ప్రసాద్ పాల్గొన్నారు.

సీతారాంపేట సర్పంచ్ మృతి

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండలం సీతారాంపేట సర్పంచ్ చేమూరు నాగరాజు శనివారం తెల్లవారుజామున ఏర్పేడు రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పై చనిపోయి వుండడం కనిపించింది. మృతికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి వుంది.

పెద్దిరెడ్డిని కలిసిన దేవికా చౌదరి

ప్రజాశక్తి - బాలాయపల్లి: వైసిపి రాష్ట్ర మహిళా అధికార ప్రతి నిధి రాయి దేవికా చౌదరి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆమె మండల విశేషాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆ మండలంలోని అవసరమైన సంక్షేమ పథకాలపై వివరించారు. రానున్న ఎన్నికల్లో కష్టపడి పని చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. బాలాయ పల్లి మండల అభివృద్ధి కోసం మంత్రిని నిధులు మంజూరు చేయాలని కోరారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -ఏర్పేడు: ఏర్పేడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీ సోమవారం ఉదయం 10.30 గంటలకు సర్వసభ్య సమావేశం మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు పస్పూరు గీత అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎ గిడ్డయ్య శనివారం తెలిపారు. ఈ సమావేశంలో అనేక అజెండాలపై చర్చిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరూ అధికారులు, వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పాల్గొనాలని కోరారు.

సిపిఎంను ఆదరించండి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నిత్యం సామాన్య ప్రజల బాగు కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం నిజాయితీగా, నిస్వార్థంగా పాటుపడుతున్న సిపిఎంను ఆదరించాలని సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ పేర్కొన్నారు. గూడూరు ఆర్టీసి బస్ స్టాండ్ ఆవరణలో సిపిఎం ఆధ్వర్యంలో శనివారం విరాళాలు సేకరించారు. అన్ని వర్గాల ప్రజల కోసం పోరాడుతున్న సిపిఎంను ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బివి రమణయ్య సురేష్, చంద్రయ్య, పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా యూనివర్సిటీ, డిఎస్టీ- క్యూరీ- ఏఐ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ కు సంబంధించిన పోస్టర్‌ను వీసీ ఆచార్య డి భారతి, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్ రజని, కోఆర్డినేటర్ డిఎస్టీ- క్యూరీ- ఏఐ సెంటర్ ఆచార్య ఎస్ జ్యోతి, అసిస్టెంట్ కోఆర్డినేటర్ డిఎస్టీ- క్యూరీ- ఏఐ సెంటర్ డాక్టర్ పి భార్గవి, డిఎస్టీ- క్యూరీ- ఏఐ సెంటర్ మెంబర్ ఆచార్య కె ఉష రాణి, ఆచార్య ఆర్ ఉష, డాక్టర్ జి సూర్య కుమార్ విడుదల చేశారు. ఈ నెల 26 నుండి మార్చి 2వతేదీ వరకు ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, 11, 12 తేదీల్లో ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు వీసీ తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మహిళా వర్సిటీ ప్రతినిధులు

నేడు సూరావారిపల్లెలో పరుష పందేలు

ప్రజాశక్తి -రామచంద్రాపురం: మండలంలోని సికేపల్లి పంచాయతీకి చెందిన సూరావారిపల్లిలో ఆదివారం పరుష పందేలు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ పరుష పందేలు ఆదివారం ఉదయం 12 గంటల నుండి ప్రారంభమవుతుందని, పశువుల పందాలలో కోడిగిత్తలు, పశువుల యజమానులు భారీ స్థాయిలో పాల్గొంటారని గ్రామస్తులు తెలిపారు. పశువుల పందాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామ పెద్దలు చొరవ తీసుకోవాలని, నిర్వాహకులకు పోలీసులు నోటీసులు జారీ చేసినట్లు ఆర్ సి పురం పోలీసులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

17 మందికి ఓటు హక్కు కల్పించిన తహశీల్దారు

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి): పోలింగ్ కేంద్రాలను చంద్రగిరి మండల తహశీల్దార్ మారుతి శనివారం తనిఖీ చేశారు. మండలంలోని భీమవరం, నారావారిపల్లి, చిన్న రామాపురం, ఎ రంగంపేట, గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం చిన్న రామాపురం ఎస్సీ కాలనీ, భీమవరం ఎస్సీ కాలనీ లో ఎలాంటి గుర్తింపు కార్డులు లేకపోవడంతో ఓటు హక్కు పొందలేని 17 మంది ఓటర్ల గృహాలకు వెళ్లి పరిశీలించారు. ఆ ఎస్సీలకు ఇప్పటివరకు ఎలాంటి గుర్తింపు కార్డు లేకపోవడంతో అవారు స్వయంగా రెవెన్యూ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్డులు లేని 17 మంది ఎస్సీలకు ఓటు హక్కు కల్పించారు. తమకు ఓటు హక్కు కల్పించినందుకు వారు తహశీల్దారుకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యం: మాజీ ఎమ్మెల్యే

ప్రజాశక్తి -వెంకటగిరి : చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని మాజీ శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. రానున్న ఎన్నికల దృష్ట్యా టిడిపి ప్రచారంలో భాగంగా వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఏడవ వార్డు కోట్ల ప్రాంతంలో ప్రతి గడప గడపకు వెళ్లి చంద్రన్న ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులుకొల్లు రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీధర్ ప్రసాద్, ముమ్మిడి నర్సింలు, చలపతి, బాబు, జనసేన నాయకులు చెముడు రాధయ్య, రామారావు అనిల్ పాల్గొన్నారు.

'తెలుగుగంగ' నీరెక్కడ ?: టిడిపి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అధికారంలోకొచ్చిన మూడు నెల్లలో ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీ ప్రజలకు తాగు నీరందిస్తామని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా ఇంత వరకు నీటి జాడ ఏదని తిరుమలనగర్, మంగళం గ్రామ పంచాయతీల టిడిపి కమిటీ అధ్యక్షులు గోవిందరాజులు, సురేష్ ప్రశ్నించారు. తిరుమలనగర్ టిడిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ [illegible] ఇవ్వాలని వైసిపి ప్రభుత్వం పట్టాలు ఇచ్చి వారికి స్థలాలు చూపించారా? అని ప్రశ్నించారు. [illegible] ఈ కార్యక్రమంలో టిడిపి తిరుమల నగర్, మంగళం పంచాయతీ [illegible] జనసేన నాయకులు కిషోర్, రామచంద్ర, నవీన్ పాల్గొన్నారు.

తగ్గించినా ఏం'లాభం'

- నగరి మరమగ్గం కార్మికుల ఆవేదన
- ఎన్నికల ట్రెండ్‌గా రోజా ప్రచారం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సిఎం జగన్మోహన్‌రెడ్డి కుడిచేత్తో ఇచ్చి ఎడం చేత్తో లాక్కున్నట్లుగా సంక్షేమ పథకాలు ఉన్నాయని నగరి మరమగ్గం కార్మికులు వాపోతున్నారు. మరమగ్గాల విద్యుత్ బిల్లులు తగ్గిస్తూ జీవో నంబర్ 31ని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. అయితే మరమగ్గం కార్మికులకు పూర్తిగా విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తూ అందులో లేదు. సారాంశం ఏమంటే కేవలం ఎలక్ట్రికల్ డ్యూటీ ఛార్జీ యూనిట్‌కు ఒక్క రూపాయి ఉండగా ఆరు పైసలకు తగ్గించారు. 500 యూనిట్ల వరకూ మరమగ్గం కార్మికుడు నెలలో వాడతారు. ఈ డ్యూటీ ఛార్జి వల్ల కేవలం 150-200 రూపాయలు మాత్రమే తగ్గుతుంది. అయితే పూర్తిగా బిల్లు ఏదో తగ్గించినట్లుగా మాస్టర్ వీవర్స్ రాయలసీమ అసోసియేషన్ ప్రెసిడెంట్ సెల్వమణి. మంత్రి రోజాకు వీవర్స్ అంతా రుణపడి ఉండాలని, ఆమె వెంటే అందరూ ఉండాలని ప్రచారం చేసుకోవడం గమనార్హం.

నగరి చుట్టుపక్కల ప్రాంతంలో మొదలియార్స్ ప్రధాన వృత్తి మరమగ్గాలు నేయడం. నారాయణవనం, పుత్తూరు, చింతలపట్టెడ, నగరి, ఏకాంబరకుప్పం, సత్రవాడ, పుదిపేట ప్రాంతాల్లో ఏడువేల మగ్గాలు ఉన్నాయి. దాదాపు 25 వేల కుటుంబాలు ఈ మరమగ్గాలను నమ్ముకుని జీవిస్తున్నాయి. ఐదేళ్ల క్రితం 500 యూనిట్లు వాడితే నెలకు 1000-1500 కరెంట్ బిల్లు వచ్చేది. జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఈడీ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు, ఫిక్స్‌డ్ ఛార్జీలంటూ దాదాపు ఏడింటి పేరుతో భారాలు మోపుతూ వచ్చింది. దీతో 500 యూనిట్లు వాడిన మరమ్మగ్గం కార్మికులకు 3000-4000 రూపాయలు కరెంట్ బిల్లు వస్తోంది. తమకు తమిళనాడు తరహాలో 500 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇవ్వాలని కార్మికులు డిమాండ్ చేస్తూ దీర్ఘకాలిక పోరాటాలు చేస్తూ ఉన్నారు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన జీవో వల్ల 4వేల రూపాయల్లో తమకు కలిసొచ్చేది కేవలం 200 రూపాయలు మాత్రమేనని వారు పెదవి విరుస్తున్నారు.

500 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలి



తమిళనాడు తరహాలో మరమగ్గం కార్మికులకు 500 యూనిట్లు ఉచితంగా ఇవ్వాలి. జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన తాజా జీవో వల్ల ఒరిగిందేమీ లేదు. మంత్రి రోజా భర్త సెల్వమణి మరమగ్గం మాస్టర్ వీవర్స్ సంఘానికి అధ్యక్షులుగా ఉన్నారు. ఎంతో మేలు చేసినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని, అందులో ఏమాత్రం వాస్తవం లేదన్నారు. పోరాటాల ద్వారానే ఉచిత విద్యుత్ పొందాలన్నారు.

- పెరుమాళ్, పవర్‌లూమ్స్ కార్మికుల సంఘం ప్రధాన కార్యదర్శి (సిఐటియు)

క్రైం న్యూస్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

ప్రజాశక్తి -రేణిగుంట: మండలంలో శనివారం చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు.

చెరకు లోడ్‌తో వెళుతూ డ్రైవరు మృతి

రోడ్డు ప్రమాదంలో ట్రాక్టరు డ్రైవరు మృతి చెందిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. తూర్పుగోదావరి జిల్లా రాజవరం గ్రామానికి చెందిన సత్తిబాబు ఏపి03 జెడ్ 8460 నెంబరు ట్రాక్టరులో చెరకులోడుతో పుత్తూరు వైపు వెళుతుండగా గాజులమండ్యం సమీపంలోని ఆల్లికోళం వద్ద ట్రాక్టరు రోడ్డు పక్క ఆపాడు. ట్రాలీ వెనకవైపున చెరకును సరిచేస్తుండగా పుత్తూరు డిపోకు చెందిన ఏపీ 03 జెడ్ 5497 నెంబరు గల ఆర్టీసి బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సత్తిబాబు (55)అక్కడికక్కడే మృతి చెందాడు. గాజులమండ్యం పోలీస్ స్టేషన్ బ్లూ కోల్ట్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాజులమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోలో వెళుతూ వ్యక్తి మృతి

రేణిగుంట : గాజుల మండ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని వాల్మార్ట్ వద్ద ఆటోను వెనుక వైపు నుండి కారు ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలు పాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. గాజులమండ్యం పోలీసులు కథనం మేరకు...ఏర్పేడు మండలం పాపానాయుడు పేట నుండి ఆటోలో సెంట్రింగ్ వస్తువులు తీసుకుని వెళ్లేందుకు తిరుపతికి వస్తుండగా రేణిగుంట – తిరుపతి మార్గంలో ఉన్న వాల్ మార్ట్ వద్ద రేణిగుంట నుంచి తిరుపతి వైపు వస్తున్న కారు ఆటోను వెనుకవైపు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై పడడంతో ఏర్పేడు మండలం మునగల పాలెంకు చెందిన గిరి (45) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న అర్జున్, వెంకటమునికి గాయాలు అయ్యాయి. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఎస్ వి మెడికల్ కళాశాలకు, క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాజులమండ్యం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దర్జాగా గ్రావెల్ దందా

రాత్రికి రాత్రే తవ్వకాలు, తరలింపు

ప్రజాశక్తి - గూడూరు టౌన్: గూడూరు నియోజకవర్గంలో చిల్లకూరు, కోట, చిట్టమూరు మండలాల్లో ఓ ఉన్నతాధికారి అండతో గ్రావెల్, మట్టి రాత్రికి రాత్రే అక్రమార్కులు తవ్వేసి తరలించే దందా నడుపుతూ కోట్లు గడిస్తున్నారు. చిల్లకూరు మండల పరిధిలోని కడివేడు, తిమ్మనగారిపాలెం, తోనుకుమాల, చింతవరం గ్రామాల్లో గ్రావెల్, మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఉన్నతాధికారి అండదండలు ఉండడంతో కిందిస్థాయి సిబ్బంది పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. మండల పరిధిలో ఇళ్లు, అపార్టుమెంట్ల నిర్మాణాలు, వెంచర్ల పనులు జోరుగా సాగుతున్నాయి. దీంతో గ్రావెల్‌కు, మట్టికి డిమాండ్ పెరిగింది. రాత్రుల్లో వందల లారీల్లో గ్రావెల్, మట్టి తరలించేస్తున్నారని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే మొక్కుబడి జరిమానా విధించి మమా అనిపిస్తున్నారు. కడివేడు రెవెన్యూ పరిధిలోని అటవీ భూముల్లో కొన్నిరోజులుగా రాత్రిపూట భారీ యంత్రాలతో దర్జాగా గ్రావెల్, మట్టి తరలిస్తున్నారు. ట్రాక్టర్ గ్రావెల్, మట్టి లోడ్ 1000-1500 ధర పలుకుతోంది. అదే టిప్పర్ అయితే 3వేల నుంచి నాలుగువేలు. చిల్లకూరు పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలోని అభిరాం శ్రీను వెంచర్స్‌కు రాత్రిపూట గ్రావెల్, మట్టి తరలిస్తున్నా తహశీల్దార్ పట్టించుకున్న పాపాన పోలేదు. కలెక్టర్, జేసీ స్థాయిలో అధికారులు స్పందిస్తే తప్ప చిల్లకూరు మండలంలో అక్రమ దందాకు అడ్డుకట్ట వేసే పరిస్థితి లేదని ప్రజలు వాపోతున్నారు.





గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలి : జోగి శివకుమార్, సిపిఎం

నియోజకవర్గంలో అధికారుల అండదండలతో గ్రావెల్ మాఫియా చెలరేగిపోతోంది. పలుమార్లు ప్రజలు మండల అధికారులకు అర్జీ ఇచ్చినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. లేదంటే సహజ వనరులు కొల్లగొట్టి పర్యావరణానికి ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉంది.

అధికారుల అండతోనే గ్రావెల్ దందా : బట్ట గోపియాదవ్, వైసిపి జిల్లా బీసీ సెల్ సెక్రటరీ



నియోజకవర్గంలో ఓ ఉన్నతాధికారి అండదండలతోనే అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. అవినీతి అధికారుల వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి, గ్రావెల్ మాఫియాకు అడ్డుకట్ట వేయాలి.

1న తిరుపతిలో కాంగ్రెస్ బహిరంగసభ

- తెలంగాణా సిఎం రేవంత్‌రెడ్డి రాక
- పిసిసి అధ్యక్షురాలు షర్మిల హాజరు

పజాశక్తి - తిరుపతి టౌన్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్ పిసిసి అధ్యక్షురాలు షర్మిల మార్చి నెల ఒకటో తేదీ తిరుపతిలో కాంగ్రెస్ పార్టీ బహిరంగ సభకు హాజరుకానున్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్వహించే సభకు అనుమతి ఇవ్వాలని కోరుతూ తిరుపతి కాంగ్రెస్ నగర అధ్యక్షులు యార్లపల్లి గోపి ఆధ్వర్యంలో తుడా విసి వెంకటనారాయణకు, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ అమరయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు యార్లపల్లి గోపి మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రివర్యులు డాక్టర్ చింతామోహన్ ఆధ్వర్యంలో మార్చ్ 1 వ తేదీన జరిగే తిరుపతి బహిరంగ సభకు రేవంత్‌రెడ్డి, షర్మిల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాగూర్ పాల్గొనే సభను జయప్రదం చేయాలని కోరారు. ఇందిరామైదానం, నెహ్రూ మున్సిపల్ స్కూలు మైదానం పరిశీలించామని, అనుమతి ఇవ్వాలని కోరారు. రవి, సమీవుల్లా, మున్వేర్ పాల్గొన్నారు.


రేపు టిటిడి పరిపాల భవనం వద్ద ధర్నా

కరపత్రం ఆవిష్కరించిన సిఐటియు నేతలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్ : తిరుమలలో కళ్యాణకట్టలో పనిచేస్తున్న క్షురకుల జీతాలు పెంపు కోసం, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ ఈ నెల 26వ తేదీన టిటిడి పరిపాల భవనం వద్ద చేపట్టే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాన్ని యశోదనగర్‌లోని సిఐటియు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టీటీడీ కాంట్రాక్టు ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు టి సుబ్రమణ్యం, క్షౌరవృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం గంగులప్ప మాట్లాడుతూ తిరుమలకు వచ్చే భక్తులకు తలనీలాలు తీయడమే కాకుండా, టీటీడీ ఆదాయం రావడానికి కళ్యాణకట్ట క్షురకులే కీలకమన్నారు. కొంతమంది క్షురకులపై కక్ష గట్టి 9 మందిని తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. గత బోర్డు సమావేశంలో 20 వేల రూపాయలు పెంచుతున్నట్టు నిర్ణయం చేసిందని, అయితే కేవలం 18 మందికి మాత్రమే పెరిగిన జీతాలు వర్తిస్తాయన్నారు. దాదాపు 800 మందికి పెరిగిన జీతాలు వర్తించవని, ఈ విషయాన్ని టిటిడి గుర్తు పెట్టుకొని కళ్యాణ్ కట్టలో పనిచేస్తున్న వారందరికీ జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. జీతాల పెంపు కోసం, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, బస్సు పాసు సౌకర్యం పునరుద్ధరించాలని, బ్రహ్మోత్సవ బహుమానం ఇవ్వాలని, లడ్డూ, వడ ఇవ్వాలని కోరుతూ ఈనెల 26వ తేదీ నిర్వహించే ధర్నాకు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈనెల 26న జరిగే పాలకమండలి సమావేశంలో జీతాలు పెంపు పై నిర్ణయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, ప్రసాదు, రెడ్డప్ప, ముని, నరహరి, వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, నరేంద్ర, మురళీమోహన్, రెడ్డి శంకర, సునీల్, రమేష్ పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన 'జీటో' యువ ప్రతినిధుల బృందం

ప్రజాశక్తి- వరదయ్యపాలెం: చెన్నైలోని జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (జీటో) కు చెందిన 100 మంది సభ్యుల యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్తల ప్రతినిధి బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. సంస్థ కన్వీనర్ నమన్ మునోత్ నేతృత్వంలో విచ్చేసిన బృందానికి శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి రమేష్ కుమార్ సాదర స్వాగతం పలికారు. పారిశ్రామికవాడ ప్రగతి, ప్రత్యేకతలతో పాటు ఇక్కడ వ్యాపారం చేయడం వల్ల కలిగే వివిధ ప్రయోజనాలను వారికి వివరించారు. ప్రతినిధులను ఉద్దేశించి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం శ్రీసిటీలో చేపడుతున్న సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి గురించి వివరించారు. నివాస ప్రాంతాలు, విద్యాసంస్థలు, రిటైల్ మాల్స్, హోటళ్లు, వినోద కేంద్రాలతో కూడిన సామాజిక సదుపాయాల సృష్టి తమ ప్రస్తుత ప్రాధాన్యత కాగా, ఈ తరుణంలో యువ ఔత్సాహికుల బృందం సందర్శన అత్యంత సముచితంగా తాము భావిస్తున్నామన్నారు. బృందంలో కొందరు ఇప్పటికే శ్రీసిటీలోని కొన్ని పరిశ్రమలతో వ్యాపార సంబంధాలను కలిగి ఉండడం పట్ల సంతోషంగా ఉందన్నారు. సందర్శనకు వచ్చిన వారిలో మరింత మంది ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. శ్రీసిటీ సందర్శన ఏర్పాటు పట్ల జిటో ప్రతినిధి ప్రవేష్ షా శ్రీసిటీ యాజమాన్యానికి కృతజ్ఞ తలు తెలిపారు. టూత్ బ్రష్‌లు, టీ, కాఫీ, చాక్లెట్‌లు, కార్న్ ఫ్లేక్స్, ఎఫ్ఎంసిజి, మొబైల్ ఫోన్లు, ఏసీలు, కార్లు, మెట్రో రైళ్ల వంటి వివిధ రకాల రోజువారీ ఉత్పత్తులు ఇక్కడ తయారు కావడం గురించి తెలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు. శ్రీసిటీ పర్యావరణ హిత కార్యక్రమాలను కొనియాడారు. 210 కు పైగా అంతర్జాతీయ సంస్థల ఏర్పాటుతో ఇక్కడ ప్రజల జీవన ప్రమాణాలు ఎలా మెరుగుపడ్డాయి? మహిళలకు అత్యధిక ఉపాధి అవకాశాలపై వారు ఆనందం వ్యక్తం చేశారు. పర్యటనలో భాగంగా వీరు శ్రీసిటీ అధికారులతో సమావేశమై తమ పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహకాలు, పర్యావరణ కార్యక్రమాలు, వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతులు, భద్రత రక్షణ, కార్పొరేట్ సామాజిక భద్రత చర్యలు మొదలైన వాటి గురించి వివరాలను సేకరించారు. అనంతరం ఏ యల్ ఎఫ్, రాక్‌వర్త్, జెట్‌టిటి తదితర పలు శ్రీసిటీ పరిశ్రమలను సందర్శించి అక్కడ కార్యకలాపాలను ప్రత్యక్షంగా వీక్షించారు.



యువ ప్రతినిధుల బృందాన్ని సన్మానిస్తున్న దృశ్యం

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రండి..

మంత్రికి సురుటుపల్లి ఆలయ ఛైర్మన్ ఆహ్వానం

ప్రజాశక్తి -నాగలాపురం : ఫిబ్రవరి 29 నుంచి మార్చి 10వ తేదీ వరకు సురుటిపల్లి ఆలయంలో నిర్వహించనున్న శివరాత్రి బ్రహ్మోత్సవాలకు రావాలనిపల్లి కొండేశ్వర స్వామి ఆలయ ఛైర్మన్ ఎవిఎం బాలాజిరెడ్డి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి శనివారం ఆహ్వాన పత్రికను అందించారు. తిరుపతిలో మంత్రి స్వగృహంలో సురుటుపల్లి ఆలయ ధర్మకర్తల మండల ఛైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, కార్యనిర్వహణ అధికారి కె.రామచంద్ర రెడ్డి ఆధ్వర్యంలో సభ్యులు ఆనందయ్య, రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందించి ఆలయ ప్రధాన అర్చకులు కార్తికేయన్ వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వదించారు. అనంతరం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి చేతుల మీదుగా మహాశివరాత్రి గోడపత్రికలను ఆవిష్కరించారు. మంత్రి మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆలయ పాలక వర్గానికి మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూక తోటి రాజేష్, జిల్లా కార్మిక శాఖ అధ్యక్షులు బేరేంద్ర వర్మ, మండల అధ్యక్షులు అపరంజి రాజు, మేజర్ పంచాయతీ సర్పంచ్ చిన్నదురై సుధా, ఎంపీపీ శ్యామ్, జేసిఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను అందిస్తున్న సురుటిపల్లి ఆలయ కమిటీ సభ్యులు

ఆర్అండ్‌బి రోడ్డునూ వదల్లేదు: వినుత

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి-పిచ్చాటూరు రోడ్డు పొడవునా ఆక్రమణలేననీ, ఆఖరుకు ఆర్అండ్‌బి రోడ్డును కూడా వైసీపీ నేతలు వదల్లేదని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట వినుత విమర్శించారు. శనివారం ఆమె శ్రీకాళహస్తి-పిచ్చాటూరు ప్రధాన మార్గంలో జరుగుతున్న అక్రమ కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీకాళహస్తి నుండి పిచ్చాటూరుకి వెళ్లే రోడ్డుకిరువైపులా ఉన్న రోడ్డు పోరంబోకు స్థలాల్లో వైసీపీ నేతలు కాంప్లెక్స్‌లు కట్టి లక్షలకు అమ్మేస్తున్నారని విమర్శించారు. కబ్జా స్థలంలో మద్యం షాపు నడపడం చూస్తే అధికారులు ఈ కబ్జాలను ప్రోత్సహిస్తున్నారో తెలుస్తుందన్నారు. రాబోయే ఉమ్మడి ప్రభుత్వంలో కబ్జాలకు గురైన ప్రతి సెంటు స్థలాన్ని వెనక్కి తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తోట గణేష్, ఐటీ కోఆర్డినేటర్ కావలి శివకుమార్, తొట్టంబేడు మండల అధ్యక్షులు పేట చంద్ర శేఖర్, నాయకులు రవి కుమార్ రెడ్డి, రాజ్యలక్ష్మి, పేట చిరంజీవి, నక్కా ప్రసాద్, శారద, గురవయ్య, ఉదయ్, హేమంత్ గౌడ్, దినేష్, జన సైనికులు బబ్లూ పాల్గొన్నారు.

వడమాలపేటను అభివృద్ధి చేస్తా: భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: వడమాలపేట అభివృద్ధికి కృషి చేస్తానని నగరి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. శనివారం వడమాలపేట పంచాయతీ ఏడబ్ల్యు, ఎస్టీకాలనీ, రామసముద్రం , లక్ష్మీపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ నిర్వహణలో భాగంగా ఇంటింటికి వెళ్లి టిడిపి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికార పార్టీ వారు వడమాలపేట మండలంలో పాదిరేడు అరణ్యం భూముల్లో పేదల నుండి కోట్లలో కమీషన్లు వసూలు చేయడమే కాకుండా 70 ఎకరాలు డికెటీ పట్టాలు వేసుకుని దేవుడి సొమ్ముని అప్పనంగా కొట్టేశారని విమర్శించారు. పరిశ్రమలు తెచ్చి ఉద్యోగాలు ఇస్తామని భూములు తీసుకున్న రోజా ఒక్క పరిశ్రమైనా తెచ్చిందా? అని ప్రశ్నించారు. తనను గెలిపిస్తే వడమాలపేటను అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని వివరించారు.

అభ్యర్థి భాను ప్రకాష్ ఖరారుపై ఆనందోత్సాహం

2024 అసెంబ్లీ ఎన్నికల మొదటి జాబితాలో నగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థిగా గాలి భాను ప్రకాష్ పేరు ఖరారు చేయడంపై ఆ పార్టీలో ఆనందోత్సాహాలు వ్యక్తం అయ్యాయి. పుత్తూరు మున్సిపాల్టీ 10వ వార్డుకు చెందిన టిడిపి ఇన్చార్జి. రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్. డిజి ధనపాల్ ఆధ్వర్యంలో కార్యకర్తలు, నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. టపాకాయలు పేల్చి స్వీట్లు పంపిణీ చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు. ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ డిఎస్ గణేష్, బిసిఆర్ యుగంధర్, ఏ ఆనంద్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న గాలి భానుప్రకాష్

వాలంటీర్లకు ఘన సన్మానం

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో వాలంటీర్లను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాళహస్తి నియోజక వర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి మాట్లాడుతూ ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లడంలో వారిది ప్రత్యేకమైన పాత్ర అన్నారు. సేవే లక్ష్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ అందరి వారుగా పేరు తెచ్చుకున్నారన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ అనే భేదం లేకుండా సేవ చేస్తున్న వారు వాలంటరీలు ఒకరే అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యే లా వివరించాలని కోరారు. ఎంపీడీవో పటాన్ రఫీ ఖాన్ మాట్లాడుతూ మండలం లో 22 సచివాలయాలకు చల్లపాలెం, సుబ్బానాయుడు కండ్రిగ సచివాల యాలకు సంబంధించి రెండు సేవవజ్ర అవార్డులు, 22 సచివాల యాలకు ఐదు సేవారత్న, మిగతా 282 సేవా మిత్రా వాలంటరీలుగా ప్రభుత్వం గుర్తించి వారిని సన్మానిం చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ ఆర్‌టిసి వైస్ ఛైర్మన్ మిద్దెల హరి, శ్రీకాళహస్తి మండల వైసిపి అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, రామాపురం పంచాయతీ సర్పంచ్ బాలిరెడ్డి, రాచగున్నేరి పంచాయతీ వైస్ సర్పంచ్ రామచంద్రయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు వాలంటరీలు పాల్గొన్నారు.

ప్రీ పబ్లిక్ పరీక్షల పరిశీలన

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ప్రీ పబ్లిక్ పరీక్షలను బుచ్చినాయుడు కండ్రిగ మండల విద్యాశాఖ అధికారి శనివారం పరిశీలించారు. విద్యార్థిని విద్యార్థులను పరిశీలించి వారికి కొన్ని సూచనలు, సలహాలు ఇచ్చారు. నెలవాయి, కళ్లివెట్టు పాఠశాలలో వారివారి ప్రధానోపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థుల పరీక్షలను పరిశీలించి సోమవారం నిర్వహించే పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి? ఎలా రాయాలి? అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురికాకుండా ఓటు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకుని మంచి నాయకుడిని ఎన్నుకోవాలని ఓటు విలువను తెలుపుతూ ప్రజాసత్త సంస్థ అవగాహన సమావేశాలు నిర్వహిస్తోందని ఆ సంస్థ సభ్యులు శోభన్ బాబు పేర్కొన్నారు. గూడూరు డిఆర్‌డబ్ల్యు మహిళా కళాశాలలో ప్రజాసత్త సంస్థ ఆధ్వర్యంలో ఓటు విలువను తెలుపుతూ విద్యార్థినులకు శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అరవ పార్వతయ్య, వెంకటరమణయ్య, పుష్ప పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయులకు మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల విద్యాశాఖ అధికారులు కె. రవీంద్రనాథ్, ఎ మునిసుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు కె రమణయ్య ఆధ్వర్యంలో మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నిజాం పిజియో థెరపీ , హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో శనివారం పిజియో థెరపి మెడికల్ క్యాంపు, అవవాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిజియోథెరపీ కిట్లను సరఫరా చేశారు. రెండు పిజియో థెరపీ కిట్‌లు ఎంఈఓ లకు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సహిత విద్యా రిసోర్స్ పర్సన్స్ ఆర్ అయ్యప్ప రెడ్డి, పిజి నయోమి, పిజియోథెరపిస్ట్ వి జ్ఞాన శేఖర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపించండి: బొజ్జల సుధీర్ రెడ్డి

ప్రజాశక్తి- రేణిగుంట : శ్రీకాళహస్తి నియోజకవర్గ టిడిపి ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని టిడిపి శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. శనివారం పట్టణంలోని బస్టాండ్ సెంటరులో పట్టణ యువ నాయకులు బుల్లెట్ బాబు, రాజ, షబ్బీర్ ఆధ్వర్యంలో సుమారు వంద మంది టిడిపిలోకి చేరారు.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, గూడూరు
O.S.NO. 121/2022

బద్రి శ్రీలత,
భర్త చంద్రయ్య, డోర్.నెం. 14/3,
గూడూరు, తిరుపతి జిల్లా ...వాది

Vs

1. ఇసనాక విజయ భాస్కర రెడ్డి, S/o. లేట్ వెంకట సుబ్బారెడ్డి,
2. ఇసనాక వాసా రెడ్డి, S/o. లేట్ వెంకట సుబ్బారెడ్డి
3. ఓడూరు వెంకట రమణరెడ్డి, S/o. లేట్ కస్తూరి రెడ్డి

To

ఇసనాక వాసారెడ్డి, S/o. లేట్ వెంకట సుబ్బారెడ్డి
చిన్నకటువపల్లి గ్రామం, చిల్లకూరు మండలం,
తిరుపతి జిల్లా - 524412.

వాది అయిన బద్రి శ్రీ లత బాకీ వసూలు నిమిత్తం మీ పై **O.S.NO. 121/2022** దాఖలా చేసి ఉన్నందున యిందు విషయమై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల 12.03.2024 ఉదయం 10 గం॥లకు ఖుద్దునగానీ, వకీలు ద్వారాగానీ, ఈ కోర్టులో హాజరై వారితో మనవి చేసుకోవలసినది. లేని యెడల సదరు విషయమై నీ పరోక్షము విచారించి తీర్మానవము చేయుదురని తెలియజేయడమైనది.

డి.వెంకటేశ్వర రావు,
వాది తరపున న్యాయవాది
గూడూరు, సెల్: 9866072082

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టు, గూడూరు
O.S.NO. 217/2022

Canara Bank (E-Syndicate Bank)
Gudur Branch,
Rep by its Branch Manager ... **Plaintiff**

Vs

1.N.Sreerama Murthy
2. Itta Yona ...**Defendants**

To

Itta Yona, S/o. Lakshmaiah, Working Electric Grade-1, Fitter South Central Railway, Kodavaluru, Bitragunta, SPSR Nellore Dist.,

వాది అయిన కెనరా బ్యాంగ్ (ఇ-సిండికేట్ బ్యాంక్) గూడూరు బ్రాంచ్ వార్డు బాకీ వసూలు నిమిత్తం మీపై **O.S.NO. 217/2022** దాఖలా చేసి ఉన్నందున యిందు విషయమై మీకు ఏమైగా ఆక్షేపణలు వున్న యెడల 12.03.2024 ఉదయం 10గం॥లకు ఖుద్దున గానీ, వకీలు ద్వారా గానీ, ఈ కోర్టులో హాజరై వారితో మనవి చేసుకోవలసినది. లేని యెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానవము చేయుదురని తెలియజేయడమైనది.

వాయిదా : 12.03.2024

డి.వెంకటేశ్వర రావు,
వాది తరపున న్యాయవాది
గూడూరు, సెల్: 9866072082

మహారాజశ్రీ శ్రీకాళహస్తి సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
E.P.No.18/2018
O.S.NO. 18/2021

Between
Bandi Nirmala ...DHr
And
O. Sarath Babu ... JDr
Ommini Sarath Babu, S/o. O.Sreeramulu, D.No. 5/23, M.G.Street, Srikalahasti.

NOTICE

పై నంబరు E.P లో R54 నోటీసు నిమిత్తం వాయిదా 6.03.2024 యున్నది. కావున JDr పై తెలిపిన తేది ఉదయం గం॥ 10.30 ని॥లకు పై కోర్టులో వ్యక్తిగతంగా గానీ లేదా లాయర్ ద్వారాగానీ ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపవలయును. లేనిచో పై కోర్టు వారు పరోక్షముగా నిర్ణయం తీసుకొనబడును.

SCHEDULE

Chittoor District - Sri Balaji Regd District - Tirupati-Srikalahasti Sub District - Srikalahasti Municipality - Srikalahasti Town - Survey No. 259, M.G.Street - Western Side - Old D.No. 5/106 i.e D.No.5/24, 25 Old Ass. No. 2162 - New Assesment No. (5522) 101101328 - House of P. Dharma Rao, West: House Site of P. Dharma Rao North: House of A.Koneti Sriramulu and Now house of T. Krishnaiah between in the following measurement East to West is 19 1/2 feet equal to 6.45 meters, North to South 17 feet equal to 5.18 meters in total 331 1/2 square feet equal to 37 square yards equal to 30.93 square meters.
DHr. value in Rs. 10,00,000/-

Aruru Sudhakar, B.A., B.L.,
Aruru Vamsi Mohan Krishna, B.A., LL.B.,
M.Hemanth Kumar, B.Sc., B.L.,
Advocate for DHr, Srikalahasti,
Cell: 9440425335.